గిరిజనులకు రగ్గుల పంపిణీ

ప్రజాశక్తి-అరకులోయ రూరల్: తీవ్రమైన చలితో ఇబ్బందులు ఎదుర్కొంటున్న గిరిజన కుటుంబాలను ఆదుకునేందుకు అల్లూరి వాకర్స్ అసోసియేషన్ సహకారంతో అరకులోయ మండలం పద్మాపురం మేజర్ పంచాయతీ దుమ్మగూడ కాలనీలో బుధవారం రగ్గులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాన్ని దుమ్మగూడ కాలనీ ఉప సర్పంచ్ జన్ని భగత్ రాం ఆధ్వర్యంలో నిర్వహించారు. సుమారు 60 గిరిజన కుటుంబాలకు రగ్గులు అందజేశారు. చలి తీవ్రతను దృష్టిలో పెట్టుకుని ఈ కార్యక్రమం చేపట్టినందుకు గ్రామస్తులు అల్లూరి వాకర్స్ అసోసియేషన్ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కె.ధర్మ, ఎస్.బలరాం, జి.హరి, కె.సన్నమ్మ, చంప కమలతో పాటు గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

పంపిణీ చేస్తున్న వాకర్స్ సభ్యులు

శ్రమదానంతో రేకుల షెడ్డును నిర్మిస్తున్న గిరిజనులు

పాఠశాల భవనం లేక అవస్థలు

- సొంతంగా రేకుల షెడ్డు ఏర్పాటు చేసిన గ్రామస్తులు
- శాశ్వత భవనం నిర్మించాలని వేడుకోలు
- ఇదీ గిల్లలబంధ స్కూల్‌లో విద్యార్థులు, టీచర్ల దుస్థితి

ప్రజాశక్తి-చింతపల్లి : డిజిటల్ విద్య, కార్పొరేట్ స్థాయి వసతుల గురించి ప్రభుత్వం గొప్పలు చెబుతున్నా, క్షేత్రస్థాయిలో గిరిజన ప్రాంతంలోని పాఠశాలల పరిస్థితి మాత్రం నేటికీ చాలా దయనీయంగానే ఉంది. అల్లూరి సీతారామరాజు జిల్లా చింతపల్లి మండలం, బలపం పంచాయతీ పరిధి గిల్లలబంధ గ్రామంలో సొంత పాఠశాల భవనం లేకపోవడంతో విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారింది. ఈ పాఠశాలకు ఉపాధ్యాయులు అందుబాటులో ఉన్నప్పటికీ, వారు పాఠాలు చెప్పడానికి కనీస భవనం లేకపోవడం గమనార్హం. వర్షం వచ్చినా, ఎండ కాసినా విద్యార్థులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. పిల్లలు చదువుకోవడానికి పడుతున్న ఇబ్బందులను చూడలేక గ్రామస్తులే నడుం బిగించారు. తమ సొంత ఖర్చులతో తాత్కాలికంగా ఒక రేకుల షెడ్డును ఏర్పాటు చేశారు. ప్రభుత్వ సాయం కోసం ఎదురుచూడకుండా గ్రామస్తులే చొరవ చూపినప్పటికీ, అది శాశ్వత పరిష్కారం కాదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్యపై జిల్లా కలెక్టర్‌కు, ఐటీడీఏ ప్రాజెక్ట్ ఆఫీసర్‌కు, ప్రజాప్రతినిధులకు పలుమార్లు విన్నవించినా ఫలితం లేకుండా పోయిందని గ్రామస్తులు వాపోతున్నారు. అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా స్పందన లేదని, తమ పిల్లలు పాకల్లో, రేకుల షెడ్లలో చదువుకోవడం చూస్తుంటే చాలా బాధగా ఉందని వాపోతున్నారు. కూటమి ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి తమ ఊరికి శాశ్వత స్కూల్ భవనం మంజూరు చేయాలని స్కూల్ కమిటీ ఛైర్మన్ కె.నాగరాజు, కె.కోటి బాబు, గ్రామ పెద్దలు వంతల రవికుమార్, పి. రామలింగం, వి. నారాయణరావు, వంతల సత్తిబాబు, లింగేటి సింహాచలం, గ్రామస్తులు కోరుతున్నారు.

‘దారి’ చూపే నాథుడేడీ?

- విఆర్‌పురం మండలం కొండరెడ్ల, టేకులూరు, కన్నంపేటలకు రహదారి కరువు
- కొయ్యూరు మండలం మట్టంభీమవరం-వై.రామవరం రహదారిదీ అదే పరిస్థితి
- పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి- విఆర్‌పురం: తరాలు మారినా వారి తలరాతలు మారడం లేదు. మారుమూల కొండరెడ్ల గ్రామాలకు ఇప్పటికీ సరైన రహదారి లేదు. టేకులూరు వెళ్లాలంటే కాలిబాట కంటే అధ్వానంగా ఉన్న రహదారిలోనే వెళ్లాల్సి వస్తోంది. విఆర్ పురం మండలంలో మారుమూల ఉన్న కొండరెడ్ల, టేకులూరు, కన్నంపేట గ్రామాల పరిస్థితి ఇదే. స్వాతంత్ర్యం వచ్చి ఏడు దశాబ్దాలు దాటుతున్నా గిరిజన పల్లెలకు రహదారులు మాత్రం లేవు. వర్షాకాలంలో అయితే పరిస్థితి మరింత అధ్వానంగా ఉంటోంది. అత్యవసర వైద్యసేవల కోసం వెళ్లాలన్నా ఇబ్బందులు తప్పడం

టేకులూరు వెళ్లే రహదారి

రాళ్లు తేలిన మట్టం భీమవరం నుంచి వై.రామవరం వెళ్లే రహదారి

లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. గిరిజనుల అభివృద్ధికి పలు పథకాలు ఉన్నా అవి మా దరి చేరడం లేదని కొండరెడ్ల గ్రామ గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొండరెడ్లతో పాటు టేకులూరు, కన్నంపేట గ్రామాలకు వెళ్లేందుకు ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి సరైన రహదారి కల్పించాలని ఆయా గ్రామస్తులు కోరుతున్నారు. గిరిజన సంక్షేమం కోసం ఐటిడిఎలు ప్రత్యేక నిధులు వెచ్చించి తమ గ్రామాలకు కనీసం సింగిల్ బీటీ రహదారి అయినా నిర్మించాలని ఆయా గ్రామస్తులు కోరుతున్నారు.

కొయ్యూరు: కొయ్యూరు మండలం పరిధిలోని మట్టం భీమవరం నుంచి వై.రామవరం వరకూ ఉన్న రహదారి అధ్వానంగా తయారైంది. ఏళ్ల తరబడి మరమ్మతులు లేకపోవడంతో రోడ్డు పూర్తిగా శిథిలమై, వాహనాల రాకపోకలకు ఇబ్బందికరంగా మారింది. ఈ రోడ్డు మీదుగానే మండల కేంద్రం కొయ్యూరుకు వెళ్లి రావాల్సి వస్తోందని, అయితే ప్రస్తుతం రోడ్డు దారుణంగా ఉండటంతో ప్రత్యామ్నాయ మార్గాల్లో సుమారు 100 కిలోమీటర్లు చుట్టూ తిరిగి ప్రయాణం చేయాల్సిన పరిస్థితి నెలకొందని, అదే విధంగా జిల్లా కేంద్రానికి వెళ్లాలంటే దాదాపు 250 కిలోమీటర్లు ఈ దెబ్బతిన్న రోడ్డుపైనే ప్రయాణం చేయాల్సి వస్తోందని స్థానికులు వాపోతున్నారు. రోడ్డు దుస్థితి కారణంగా విద్యార్థులు, రోగులు, ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అత్యవసర సమయంలో ఆసుపత్రులకు వెళ్లాలన్నా తీవ్ర ఆలస్యం జరుగుతోందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షాకాలంలో పరిస్థితి మరింత దారుణంగా మారుతోందని తెలిపారు. సంబంధిత అధికారులు స్పందించి మట్టం భీమవరం వై.రామవరం రోడ్డును పునర్నిర్మించి ప్రజల ఇబ్బందులను తొలగించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

కిడ్నీ బాధితులకు దొన్నుదొర పరామర్శ

ప్రజాశక్తి-అరకులోయ రూరల్: విశాఖపట్నంలోని కింగ్ జార్జ్ ఆసుపత్రి (కేజీహెచ్)లో కిడ్నీ సంబంధిత వ్యాధులతో చికిత్స పొందుతున్న బాధితులను తెలుగుదేశం పార్టీ అరకువేలి నియోజకవర్గ ఇంచార్జ్, ఏపీఎస్ఆర్టీసీ విజయనగరం రీజినల్ చైర్మన్ సియ్యారి దొన్నుదొర బుధవారం పరామర్శించారు. ఈ సందర్భంగా హుకుంపేట మండలం గన్నేరపుట్టు గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ కొండబాబు, లోతేరు పంచాయితీ సిరిసగుడ గ్రామానికి చెందిన పాంగి అప్పన్న, హుకుంపేట గడుగుపల్లి గ్రామానికి చెందిన సునీతలను పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. కిడ్నీ రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆసుపత్రి వైద్యులను ఆయన కోరారు. బాధితులకు అవసరమైన అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అనంతగిరి మండల అధ్యక్షులు సోవేరి సుబ్బారావు, ఉపాధ్యక్షులు మజ్జి భీమరాజు, మడగడ గ్రామ కమిటీ ఉపాధ్యక్షులు రామచందర్, టీఎన్ఎస్ఎఫ్ అరకువేలి నియోజకవర్గ అధ్యక్షులు పెట్టేలి బాలుదొర తదితరులు పాల్గొన్నారు.



పరామర్శిస్తున్న దొన్నుదొర

అర్హులందరికీ పునరావాస ప్రయోజనం

సబ్‌కలెక్టర్, ఐటిడిఎ పిఒ శుభంనొక్వాల్

ప్రజాశక్తి - చింతూరు: పోలవరం ప్రాజెక్ట్ నిర్మాణం నేపథ్యంలో ముంపు ప్రభావిత కుటుంబాలకు పునరావాసం, పునర్వ్యవస్థీకరణ (ఆర్అండ్ఆర్) కల్పించడాన్ని రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతగా చేపట్టినట్లు పిఒ శుభంనొక్వాల్ తెలిపారు. అల్లూరి సీతారామ రాజు జిల్లా పరిధిలోని ముంపు ప్రభావిత కుటుంబాల వివరాలను సమగ్రంగా పరిశీలించి, అర్హులైన ప్రతి ఒక్క కుటుంబానికి ప్రభుత్వ నిబంధనల మేరకు పునరావాస ప్రయోజనాలు అందజేస్తున్నట్లు ఆయన వెల్లడించారు. ఇప్పటి వరకు జిల్లాలో మూడు మండలా ల్లో మొత్తం 12,362 కుటుంబాలు ముంపు ప్రభావితులుగా ఎస్సీ ఎస్‌లో గుర్తించబడగా, అందులో 9,664 కుటుంబాలకు పునరావాస ప్రయోజనాలు పూర్తిస్థాయిలో అందజేయడం పూర్తయిందన్నారు. మిగిలిన కుటుంబాలకు సంబంధించి అర్హతల నిర్ధారణ, అవసరమైన డాక్యుమెంట్ల పరిశీలన, సామాజిక ఆడిట్ వంటి ప్రక్రియలు వివిధ దశల్లో కొనసాగుతున్నాయని, అవి పూర్తయ్యాక వారికి కూడా పునరావాస ప్రయోజనాలు అందించేందుకు చర్యలు చేపడుతు న్నట్లు తెలిపారు. ఇప్పటికే పునరావాస ప్రయోజనాలు పొందిన 9,664 మంది పిడిఎస్ జాబితాను సంబంధిత తహశీల్దార్ కార్యాలయాలు, ఎంపిడిఓ కార్యాలయాలు, సదరు గ్రామ/వార్డు సచివాలయాల నోటీస్ బోర్డుల్లో శుక్రవారం నుండి ప్రదర్శనకు ఉంచడం జరుగుతుందని పిఒ తెలిపారు. పునరావాస ప్యాకేజీ కింద అర్హులైన కుటుంబాలకు ఇంటి స్థలం కేటాయింపు, గృహ నిర్మాణానికి ఆర్థిక సహాయం లేదా గృహ నిర్మాణ వ్యయం, వ్యవసాయ భూమి కేటాయింపు, నగదు పరిహారం, జీవనోపాధి పునరుద్ధరణ సహాయం అందజేస్తున్నారు. అదనంగా పునరావాస కాలనీల్లో విద్యుత్, తాగునీరు, అంతర్గత రహదారులు, డ్రైనేజీ వ్యవస్థ, పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు వంటి మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేస్తూ సమగ్ర అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రత్యేకంగా గిరిజన కుటుంబాలు, వృద్ధులు, వికలాంగులు, మహిళా ప్రధాన కుటుంబాలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా పునరావాస చర్యలు చేపడుతున్నట్లు అధికారులు తెలిపారు. గ్రామసభలు, ప్రజావేదికలు, ఫీల్డ్ స్థాయి తనిఖీల ద్వారా లబ్ధిదారుల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకొని, వాటిని తక్షణమే పరిష్కరించే విధంగా ఆర్అండ్ఆర్ యంత్రాంగం పనిచేస్తోందని పేర్కొన్నారు. పునరావాసం విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం లేకుండా అన్ని శాఖల సమన్వయంతో చర్యలు తీసుకుంటున్నామని ఆర్ అండ్ ఆర్ యంత్రాంగం స్పష్టం చేసింది. మిగిలిన అర్హులైన కుటుంబాలకు కూడా ముంపు బాధితులకు పూర్తి న్యాయం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని అధికారులు తెలిపారు.

పిఒ శుభంనొక్వాల్

ఉత్తర గాలుల ఉగ్రరూపం

- ఏజెన్సీని కమ్ముకున్న పొగ మంచు
- గడగడలాడుతున్న మన్యం
- ఉష్ణోగ్రతలు మరింత తగ్గే అవకాశం
- వ్యవసాయ పరిశోధన స్థానం ఉప సంచాలకులు అప్పలస్వామి

ప్రజాశక్తి-చింతపల్లి : ఏజెన్సీ ప్రాంతం ఈ ఏడాది తీవ్రమైన చలితో గడగడలాడుతోంది. గత పదేళ్లలో ఎన్నడూ లేని విధంగా అత్యల్ప ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయని చింతపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ఉప సంచాలకులు ఆళ్ల అప్పలస్వామి తెలిపారు. జి.మాడుగుల, పాడేరు, పెదబయలు, ముంచంగిపుట్టు మండలాల్లో ఇటీవల కొన్ని రోజుల వ్యవధిలోనే ఉష్ణోగ్రతలు ఐదు డిగ్రీల సెల్సియస్‌కు పడిపోయాయని వెల్లడించారు. సాధారణంగా జనవరి, ఫిబ్రవరి నెలల్లో మాత్రమే తీవ్రంగా కనిపించే పొగ మంచు ఈ ఏడాది డిసెంబర్ నెలలోనే విస్తృతంగా కమ్ముకోవడం అసాధారణ పరిణామమని పేర్కొన్నారు. కేవలం 20 రోజుల వ్యవధిలోనే ఉష్ణోగ్రతలు దాదాపు 10 డిగ్రీల నుంచి 5.6 డిగ్రీల కనిష్ట స్థాయికి పడిపోవడం ఆందోళన కలిగించే అంశమని తెలిపారు. ఉత్తర భారతదేశం నుంచి వీస్తున్న చలిగాలుల ప్రభావంతో ఏజెన్సీ ప్రాంతంలో ఉదయం, రాత్రి వేళల్లో దట్టమైన పొగ మంచు ఏర్పడుతోందని చెప్పారు. దీంతో దృశ్యమానత తీవ్రంగా తగ్గిపోతుండటంతో వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వెల్లడించారు. ముఖ్యంగా తెల్లవారుజామున రహదారులు పూర్తిగా కనిపించకపోవడం వల్ల పలుచోట్ల రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని తెలిపారు. కొన్ని మార్గాల్లో పొగ మంచు కారణంగా రహదారులు పూర్తిగా మూసుకుపోయిన పరిస్థితి నెలకొనడంతో వాహనదారులు అత్యంత అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. అవసరం లేని ప్రయాణాలను వాయిదా వేసుకోవాలని, రాత్రి వేళలు, తెల్లవారుజామున వాహన ప్రయాణాలను వీలైనంత తగ్గించుకోవాలని హెచ్చరించారు.

రాబోయే రోజుల్లో ఉష్ణోగ్రతలు రెండు డిగ్రీల సెల్సియస్‌కు పడిపోయే ప్రమాదం ఉందని అప్పలస్వామి తెలిపారు. ఈ నేపథ్యంలో ఏజెన్సీ ప్రాంతాలకు వచ్చే పర్యాటకులు ముందుగానే పర్యాటక కేంద్రాలకు చేరుకుని, వాతావరణ పరిస్థితులు అనుకూలంగా ఉన్న సమయంలోనే సందర్శనలు పూర్తిచేసుకుని తిరిగి వెళ్లాలని సూచించారు. చలికి తగిన దుస్తులు ధరించడంతో పాటు ఆరోగ్య పరిరక్షణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ప్రజలను ఆయన కోరారు.

జెండా ఆవిష్కరిస్తున్న సిపిఎం సీనియర్ నాయకులు బట్టా వీరయ్య

రాఘవులు ఆశయాలను కొనసాగించాలి

ప్రజాశక్తి- ఎటపాక: అమరజీవి కాటిబోయిన రాఘవులు ఆశయాలను కొనసాగించాలని ఎఎస్ ఆర్‌జిల్లా సిపిఎం కార్యదర్శి వర్గ సభ్యులు మర్లపాటి నాగేశ్వరరావు కార్యకర్తలకు పిలుపునిచ్చారు. చింతలగూడెంలో అమరజీవి కాటబోయిన వీర రాఘవులు వర్థంతి సభ సిపిఎం ఎటపాక మండల కమిటీ సభ్యులు జంగిలి సంపత్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా అయన స్తూపం వద్ద సీనియర్ నాయకులు, బట్టా వీరయ్య జెండా ఆవిష్కరించి నివాళులర్పించారు. మర్లపాటి నాగేశ్వరావు, రాఘవులు చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాఘవులు ఈ ప్రాంతంలో పార్టీ అభివద్ధి కోసం, ప్రజా సమస్యలపై రాజీలేని పోరాటం చేశారని ఆటో యూనియన్ నాయకుడిగా అనేక ఉద్యమాలు పోరాటాలు నిర్వహించారని గుర్తు చేశారు. ఆయన ఆశయాలను ముందుకు తీసుకుపోవడమే మన అందరి ముందున్న కర్తవ్యం అన్నారు. భవిష్యత్తులో సిపిఎం బలోపేతానికి ప్రతి ఒక్కరూ పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో చింతలగూడెం సిపిఎం శాఖ కార్యదర్శి డేగల మురళి, డేగల మాధవరావు, జంగిలి సంపత్, నరసయ్య, రాఘవులు సతీమణి సునీత, రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులను అభినందిస్తున్న సిబ్బంది

జాతీయస్థాయి కరాటే పోటీల్లో రాజేంద్రపాలెం విద్యార్థుల సత్తా

ప్రజాశక్తి -కొయ్యూరు: కొయ్యూరు మండలం రాజేంద్రపాలెం జిటిడబ్ల్యూఎ స్కూల్ విద్యార్థులు ఈ నెల 21న సామర్లకోట సూర్య డి.ఎన్.ఆర్ కన్వెన్షన్ హాల్లో జరిగిన 4వ ఓపెన్ జాతీయ స్థాయి కరాటే పోటీల్లో పాల్గొని పతకాలు సాధించారని అకాడమీ జనరల్ మంత్రి శ్రీను తెలిపారు. డి.శంకర్ ఆధ్వర్యంలో విజయవంతంగా పోటీలు నిర్వహించారు. పోటీల్లో పాల్గొన్న ముర్ల ఈశ్వరి, కిముడు నందిని, పొత్తూరు లోవదుర్గ, స్వప్న మాదురి, బోనంగి గీత స్వర్ణపతకాలు సాధించారు. జెర్సింగి నాగమణి, కొప్పుల భవాని, మటం కారుణ్య రజత పతకాలు సాధించారని తెలిపారు. శిక్షణ ఇచ్చిన అకాడమీ జనరల్ మంత్రి శ్రీను, హెచ్ఎం గోపాలం సిబ్బంది వారిని అభినందించారు.

మాతృభాష ఉపాధ్యాయులను రెగ్యులర్ చేయాలి

- గిరిజన సంక్షేమ శాఖ డైరెక్టర్‌కు వినతి

ప్రజాశక్తి-పాడేరు: ఆదివాసీ మాతృభాష ఉపాధ్యాయులను రెగ్యులర్ చేయాలని కోరుతూ ఆ సంఘం రాష్ట్ర కమిటీ నేతలు మంగళవారం అమరావతిలో రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ సంచాలకులు సదా భార్గవినీ కలిసి వినతి పత్రం అందజేశారు. మాతృభాష ఉపాధ్యాయులకు సమాన పనికి సమాన వేతనం 26 వేలు చొప్పున చెల్లించాలని వారు కోరారు. దీనిపై ట్రైబల్ వెల్ఫేర్ డైరెక్టర్ సానుకూలంగా స్పందిస్తూ మాతృభాష ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని నాయకులు తెలిపారు. మాతృ భాషా ఉపాధ్యాయుల జీతాలు పెంచాలని, మాతృ బహుభాషా ఆధారిత విద్యా బోధకుల కొనసాగింపుకు ప్రత్యేక జీవో జారీ చేయాలని కోరారు. మాతృభాష ఉపాధ్యాయులను ఎంటిఎస్ గా మార్చాలని, ఒడిస్సా ప్రభుత్వం మాదిరిగానే ఆంధ్రప్రదేశ్లో కూడా బహుభాషా బోధకులను రెగ్యులర్ చేసి, ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. జీవో నెంబర్ 3 పునరుద్ధరణ చేసి స్థానిక గిరిజనులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని తదితర డిమాండ్ల తో వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘం జాతీయ కార్యవర్గ సభ్యులు పి అప్పలనరస, జిల్లా కార్యదర్శి ఎం.బాలదేవ్, మాతృభాష ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర కమిటీ అధ్యక్షులు సవర ఆనందరావు, కోశాధికారి సత్తిబాబు పాల్గొన్నారు.

వినతిపత్రాన్ని ఇస్తున్న అప్పలనర్స,

ఘనంగా క్రిస్మస్ వేడుకలు

ప్రజాశక్తి-కాశీపట్నం: అనంతగిరి మండలం టోకూరు పంచాయతీ జాకరవలస బ్లెస్సింగ్ బాప్టిస్ట్ చర్చ్ ఆవరణలో స్థానిక సంఘ కాపరి రెవరెండ్ ఎలీషారావు అధ్యక్షతన క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. దైవ సేవకులు భగత్ రామ్, మోజెస్ క్రిస్మస్ వర్తమానం అందించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న జడ్పిటిసి దీసరి గంగరాజును సత్కరించారు. ఈ వేడుకలో టోకూరు సర్పంచ్ కిల్లో మోస్య, నాగులు, దేవన్న, భీమరాజు పాల్గొన్నారు.

జెడ్‌పిటిసి గంగరాజుకు పుష్పగుచ్ఛాన్ని ఇస్తున్న క్రైస్తవులు

జీడిమామిడి సస్యరక్షణపై అవగాహన

ప్రజాశక్తి-రాజవొమ్మంగి: రంపచోడవరం, ఏజెన్సీలో జీడిమామిడి పూత దశలో ఉన్న సమయంలో తీసుకోవలసిన జాగ్రత్తల గూర్చి రైతులకు అవగాహన కల్పించడం జరుగుతుందని రంపచోడవరం ప్రాజెక్ట్ హార్టికల్చర్ అధికారి ఎ.దేవదానం పేర్కొన్నారు. బుధవారం గంగవరం మండలం మంత్రిపాలెం,పిండి కొండ గ్రామాలలో జీడి మామిడి తోటల రైతులు పూతదశలో తీసుకోవలసిన జాగ్రత్తల గూర్చి రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రంపచోడవరం ఐటిడిఎ పిఒ స్మరణ్‌రాజ్ ఆదేశాల మేరకు ప్రతి మండలంలో రైతులకు అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. పూత దశలో ఉన్న జీడిమామిడి తోటలకు పూత నిలబడి, ఎక్కువ కాపు వచ్చే విధంగా కొన్ని జాగ్రత్తలు పాటించాలని సూచించారు. అధిక దిగుబడి జీడిమామిడి తోట నుండి రావాలంటే జాగ్రత్తలు తప్పనిసరి అన్నారు. ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో మండల పరిషత్ అధ్యక్షులు పల్లాల కృష్ణారెడ్డి, రైతులు పాల్గొన్నారు.

రైతులకు సూచనలు చేస్తున్న హార్టికల్చంంంర్ అధికారి దేవదానం

అవగాహన కల్పిస్తున్న సైబర్ క్రైమ్ ఇన్స్పెక్టర్ రమణమూర్తి

సైబర్ నేరాలపై అవగాహన సదస్సు

ప్రజాశక్తి-చింతపల్లి : స్థానిక ఆంధ్రప్రదేశ్ గిరిజన గురుకుల కళాశాలలో ప్రిన్సిపాల్ రామేశ్వరం ఆధ్వర్యంలో సైబర్ నేరాలపై విద్యార్థులకు బుధవారం అవగాహనా సదస్సు నిర్వహించారు. ఇందులో పాల్గొన్న అల్లూరి జిల్లా సైబర్ క్రైమ్ ఇన్స్పెక్టర్ రమణమూర్తి మాట్లాడుతూ ఇన్స్టాగ్రామ్, యూట్యూబ్, ఫేస్‌బుక్ వంటి సోషల్ మీడియా వేదికలను ఆయుధాలుగా చేసుకుని సైబర్ కేటుగాళ్లు యువతను లక్ష్యంగా చేసుకుని మోసాలకు పాల్పడుతున్నారని తెలిపారు. ఆకర్షణీయమైన ఉపాధి అవకాశాలు, ఆన్‌లైన్ పెట్టుబడులు, బ్యాంక్ లింకులు ఓపెన్ చేస్తే తక్షణ రుణాలు అంటూ నమ్మించి ఖాతాల నుంచి డబ్బులు కాజేస్తున్న ఘటనలు రోజురోజుకు పెరుగుతున్నాయని పేర్కొన్నారు. తెలియకుండానే కొందరు యువకులు అక్రమ లావాదేవీల్లో భాగస్వాములుగా మారి కేసుల్లో ఇరుక్కుని తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారని తెలిపారు. యువత సైబర్ నేరాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని సూచించారు. అనుమానాస్పద కాల్స్, లింకులు, ఓటీపీలు, ఏటీఎం వివరాలు, వ్యక్తిగత సమాచారం ఎట్టి పరిస్థితుల్లోనూ ఇతరులతో పంచుకోకూడదని స్పష్టం చేశారు. సైబర్ మోసాలకు గురైన వెంటనే లేదా అనుమానం కలిగిన వెంటనే సమీప పోలీస్ స్టేషన్ లేదా సైబర్ క్రైమ్ విభాగానికి ఫిర్యాదు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో చింతపల్లి సీఐ ఎం.వినోద్‌బాబు, ఎస్సై-2 ఎం.వెంకటరమణ పాల్గొన్నారు.

26న ప్రజా వేదిక

ప్రజాశక్తి-దుంబ్రిగుడ: ప్రజా వేదికను మండల కేంద్రంలో ఈనెల 26న నిర్వహించనున్నామని టిడిపి మండల అధ్యక్షుడు కె.ఆనంద్ తెలిపారు. మండల పరిషత్తు కార్యాలయ సమావేశ మందిరంలో జరిగే ప్రజా వేదిక(గ్రీవెన్స్) కు అర్జీస్ రీజియన్ చైర్మన్ దొన్నుదొర హాజరవుతున్నారని చెప్పారు. ప్రజా వేదికలో సమస్యలు విన్నవించేందుకు వచ్చే ప్రజానీకం ఆధార్ కార్డు జెరాక్స్ కాపీలతో హాజరు కావాలని ఆయన కోరారు.

ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్‌గా జాలాది రవి

ప్రజాశక్తి-ఎంవిపి.కాలనీ : ఆంధ్ర విశ్వవిద్యాలయం ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్‌గా కామర్స్ మేనేజ్‌మెంట్ విభాగపు ఆచార్యులు ఆచార్య జాలాది రవి నియమితులయ్యారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య జిపిరాజశేఖర్ సంబంధిత ఉత్తర్వులను ఆచార్య జాలాది రవికి బుధవారం అందించి శుభాకాంక్షలు తెలిపారు.

ఐ.టి విభాగాధిపతిగా లలిత భాస్కరి

ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, కంప్యూటర్ అప్లికేషన్స్ విభాగాధిపతిగా ఆచార్య డి.లలిత భాస్కరి నియమితులయ్యారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య జిపిరాజశేఖర్ సంబంధిత ఉత్తర్వులను ఆచార్య డి. లలిత భాస్కరికి బుధవారం అందించి శుభాకాంక్షలు తెలిపారు.

కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతిగా వల్లి కుమారి

ఆంధ్ర విశ్వవిద్యాలయం కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతిగా ఆచార్య వి.వల్లికుమారి నియమితులయ్యారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య జి.పి.రాజశేఖర్ బుధవారం సంబంధిత ఉత్తర్వులను ఆచార్య వి.వల్లికుమారికి అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఆయా కార్యక్రమాల్లో రిజిస్ట్రార్ ఆచార్య కె.రాంబాబు పాల్గొన్నారు.

డ్యామ్ సేఫ్ కమిటీ సభ్యునిగా ఆచార్య సత్యనారాయణ రెడ్డి

రాష్ట్ర ప్రభుత్వం నీటి వనరుల విభాగం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన డ్యామ్ సేఫ్ కమిటీ సభ్యునిగా ఎయు సివిల్ ఇంజినీరింగ్ విభాగం ఆచార్యులు, జియో టెక్నికల్ నిపుణుడు ఆచార్య సిఎన్‌వి.సత్యనారాయణరెడ్డి నియమితులయ్యారు. ఆచార్య సత్యనారాయణ రెడ్డిని ఎయు విసి ఆచార్య జిపి రాజశేఖర్ తన కార్యాలయంలో అభినందించారు.

ఘనంగా పెసా మహోత్సవాలు

గసభలో మాట్లాడుతున్న సర్పంచ్ సునీత

ప్రజాశక్తి- దుంబ్రిగుడ: మండలంలోని పలు పంచాయతీ గ్రామాల్లో పెసా మహోత్సవాలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గసబ గ్రామ పంచాయతీ మొర్రిగూడ గ్రామంలో సిపిఎం సర్పంచ్ పాంగి సునీత ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడూతూ, పెసా చట్టాన్ని మరింతగా బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. గిరిజన సంస్కృతి, సాంప్రదాయాలు, వనరులు కాపాడాలని పెసా ఉపాధ్యక్షులు, కార్యదర్శులను కోరారు. షెడ్యూల్ ఏరియాలో ప్రాజెక్టుల నిర్మాణం చేయాలన్నా, ఖనిజాలు తవ్వాలన్న పెసా అనుమతి, గ్రామసభ తప్పనిసరిగా ఉండాలని చెప్పారు. చట్టవ్యతిరేక పనులు గంజాయి, నాటుసారా తయారీ, అమ్మకాలు నిషేదించాలనీ సూచించారు. గ్రామ సమస్యలు పెసా గ్రామసభలో చర్చించి పరిష్కరించాలని కోరారు. 1/70భూ బదాలయింపు చట్టాన్ని మరింత పటిష్టం చేయడానికి కృషి చేయాలనీ కోరారు. ఈ కార్యక్రమంలో గసబ మాజీ సర్పంచ్ పి సురేష్ కుమార్, పంచాయతీ సెక్రటరీ కె గురుమూర్తి, ఇంజనీరింగ్ అసిస్టెంట్ నాగేంద్ర, పెసా ఉపాధ్యక్షులు, కార్యదర్శులు క్రిష్ణ మూర్తి, పి ప్రదీప్, వి.చంపాస్ కుమార్, రమేష్, సోమేశ్ పాల్గొన్నారు.

అనంతగిరి : మండలంలోని టోకూరు పంచాయతీ పరిధి ములియగుడ, నందనపురం, కొత్తవలస గ్రామాలలో గిరిజనులకు పేసా చట్టంపై అవగాహన కల్పించారు. మహోత్సవాన్ని పురస్కరించుకొని పేసా కమిటీ అధ్యక్ష కార్యదర్శులు సోమేల ఆనంద్, రవి ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, గిరిజనేతరులు షెడ్యూల్ ప్రాంతంలో భూముల క్రయ విక్రయాలు, శాశ్వత గృహాలు నిర్మాణం చేయరాదన్నారు. హక్కులు చట్టాలను తుంగలో తొక్కి కొంతమంది గిరిజనేతరులు స్థానిక గిరిజనుల పేరు మీద అక్రమాస్తులు సంప్రదించు కుంటున్నారని తెలిపారు. సహజ వనరులపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండవలసిన అవసరం ఎంతైనా ఉందని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు ప్రవీణ్ కుమార్, సుబ్బారావు, మహిళలు తదితరులు పాల్గొన్నారు

అనంతగిరిలో మాట్లాడుతున్న పెసా కమిటీ అధ్యక్షులు

పెసాతో స్వీయనిర్ణయాలు తీసుకునే హక్కు : ఎపిడి

ప్రజాశక్తి-రాజవొమ్మంగి: గిరిజనులకు వారి ప్రాంత అభివృద్ధిపై స్వీయ నిర్ణయాలు తీసుకునే హక్కు పీసా చట్టం ద్వారా ఉంటుందని ఎపిడి శ్రీనివాసవిశ్వనాథ్ అన్నారు. రంపచోడవరం. పంచాయతీ ఎక్స్‌టెన్షన్ టు షెడ్యూల్ ఏరియా యాక్ట్ (పీసా యాక్ట్) అమలులోకి వచ్చి 29 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా అల్లూరి సీతారామరాజు జిల్లా, రంపచోడవరం ఐటిడిఏ పరిధిలోని బి.వెలమకోట గ్రామానికి చెందిన ఉపాధిహామీ పథకం శ్రామికులు బుధవారం 'పీసా' అక్షరాలలో శుభాకాంక్షలు తెలిపారు. రంపచోడవరం డ్వామా, అసిస్టెంట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ తూతిక శ్రీనివాస విశ్వనాథ్ సారథ్యంలో జరిగిన ఈకార్యక్రమానికి ఉపాధి శ్రామికుల నుంచి విశేష స్పందన రాగా 1996లో ఏర్పడిన పీసా చట్టం ద్వారా ఏజెన్సీ గిరిజన ప్రాంతంలో స్థానిక సుపరిపాలనకు,గిరిజన ప్రాంతం అభివృద్ధిపై స్వీయ నిర్ణయాలు తీసుకునే హక్కు ఆదివాసీలకు ఉంటుందని ఏపీడీ శ్రీనివాస విశ్వనాథ్ అన్నారు. అనంతరం ఉపాధిహామీ పథకం పనుల పరిశీలించి,కేంద్ర ప్రభుత్వం నూతనంగా తీసుకువచ్చిన 'జీరామ్ జీ' విధానాన్ని వివరించి గ్రామీణ శ్రామికులకు ముచ్చటించారు. కార్యక్రమంలో ఉపాధిహామీ సిబ్బంది. ఉపాధి శ్రామికులు పాల్గొన్నారు.

మహా ప్రస్థానం వాహనం ఏర్పాటు చేయాలి

ఎపి ఆదివాసీ గిరిజన సంఘం మండల ప్రధాన కార్యదర్శి చిరంజీవి

ప్రజాశక్తి-చింతపల్లి చింతపల్లి ప్రాంతీయ ఆసుపత్రి నుండి మృతదేహాలను తరలించడానికి మహా ప్రస్థానం వాహనాన్ని ఆసుపత్రికి ఏర్పాటు చేయాలని ఎపి ఆదివాసీ గిరిజన సంఘం మండల ప్రధాన కార్యదర్శి పాంగి చిరంజీవి డిమాండ్ చేశారు. బుధవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ జికే వీధి మండలంలోని ఏడు పీహెచ్‌సీలు, చింతపల్లి మండలంలో నాలుగు పీహెచ్‌సీలు మొత్తం 11 పీహెచ్‌సీల పరిధిలోని ప్రజలు అనారోగ్యం చింతపల్లి ఏరియా ఆసుపత్రిలో చేరి చనిపోయిన వారి మృత దేహాలను, రోడ్డు ప్రమాదాలు వంటి కారణాలతో మృతి చెందినవి పోస్టుమార్టం నిమిత్తం ఈ ఆసుపత్రికి తీసుకొచ్చిన మృతదేహాలను బాధితుల స్వగ్రామాలకు తరలించడానికి ఆసుపత్రికి మహా ప్రస్థానం వాహనం లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు. అంబులెన్స్ కోరితే మా ప్రస్థానం అంబులెన్స్‌లు లేవని చెప్పి ప్రైవేట్ వాహనాలు ఏర్పాటు చేసుకోవాలని సూచిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులను సంప్రదిస్తే 108 అంబులెన్స్‌ను పంపిస్తున్నారని, అయితే అత్యవసర రోగుల కోసం వినియోగించాల్సిన 108 అంబులెన్స్‌లో మృతదేహాలను తరలించడం వల్ల రోగులు భయభ్రాంతులకు గురవుతున్నారని పేర్కొన్నారు. ప్రైవేట్ వాహనాల ద్వారా మృతదేహాలను స్వగ్రామాలకు తరలించడానికి అధిక మొత్తంలో ఖర్చవుతుందని, పేద గిరిజనులు ఆ భారాన్ని మోయలేని పరిస్థితిలో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం, జిల్లా ఉన్నతాధికారులు తక్షణమే చింతపల్లి ప్రాంతీయ ఆసుపత్రిలో మహా ప్రస్థానం అంబులెన్స్‌ను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే మృతదేహాలతో బంధువులతో కలిసి ఉద్యమిస్తామని హెచ్చరించారు.

నేరాలు ఘోరాలు

వ్యక్తి దారుణ హత్య

ప్రజాశక్తి-పరవాడ : మండలంలోని గ్రేటర్ విశాఖ 79వ వార్డు లంకెలపాలెం శివారు వినాయక నగర్ లేఔట్‌లో మంగళవారం రాత్రి ఒక వ్యక్తి హత్యకు గురయ్యాడు. బుధవారం ఉదయం స్థానికుల సమాచారం మేరకు పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతుడు అదే ప్రాంతంలో నివాసం ఉంటున్న ఈగల వెంకు నాయుడుగా గుర్తించారు. మృతుడి భార్య మురళి సరస్వతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పరవాడ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఈ ఘటనకు సంబంధించి అన్ని కోణాల్లో విచారణ జరుపుతున్నట్లు పరవాడ సీఐ ఆర్.మల్లికార్జునరావు మీడియా సమావేశంలో తెలిపారు. నిందితులను త్వరలోనే పట్టుకుంటామని పోలీసులు వెల్లడించారు.

భార్యను హత్య చేసిన భర్త

ప్రజాశక్తి-యలమంచిలి టౌన్ : యలమంచిలి పట్టణంలోని ధర్మవరం ఎస్సి కాలనీ సచివాలయం పరిధిలోని ఒక స్క్రాప్ దుకాణంలో భార్యను భర్త హత్య చేసిన సంఘటన బుధవారం చోటుచేసుకుంది. సిఐ ధనుంజయరావు తెలిపిన వివరాలు ప్రకారం... ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన రాకేష్ యలమంచిలి ధర్మవరంలోని ఒక స్క్రాప్ దుకాణంలో పనిచేయడానికి వచ్చి, తరువాత తనే స్వయంగా స్క్రాప్ దుకాణం నడుపుతున్నాడు. రాకేష్, అతని భార్య మాయ, ఆరు నెలల కుమార్తెతో యలమంచిలిలోని ధర్మవరంలో అద్దె ఇంటిలో నివాసముంటున్నారు. భార్యపై అనుమానంతో ఇద్దరూ తరచూ గొడవ పడుతున్నారు. ఈ నేపథ్యంలో బుధవారం ఉదయం 10.30 గంటల సమయంలో భార్యాభర్తలు గొడవపడ్డారు. ఈ సమయంలో రాకేష్ తన దగ్గర ఉన్న స్క్రూ డ్రైవర్‌తో మాయాను పొడిచి తలను గొడకు గుద్దటంతో మాయకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే రాకేష్ అక్కడ నుంచి స్థానిక యలమంచిలి ప్రభుత్వ ఆసుపత్రికి మాయను తీసుకెళ్లగా అప్పటికే ఆమె చనిపోయిందని డాక్టర్ నిర్ధారించారు. ఇన్‌చార్జి విఆర్‌ఓ పిల్లి మారేశ్వరరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు రాకేష్‌ను అదుపులోకి తీసుకొని హత్య కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని సిఐ ధనుంజయరావు తెలిపారు. ఆరు నెలల పాపను ఐసిడిఎస్ అధికారులు అందించారు.

వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి- అనకాపల్లి రూరల్ : అనకాపల్లి శారదనదిలోకి దూకి ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నారు. బుధవారం సుమారు సాయంత్రం 4 గంటల సమయంలో బ్రిడ్జి పైనుండి శారద నదిలోకి దూకి మృతి చెందాడు. మృతుడు కశింకోట వాసి పూజారి వెంకటరమణగా ప్రాథమిక సమాచారం. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆటోను ఢీకొని బైకిస్టు దుర్మరణం

ప్రజాశక్తి-యలమంచిలి టౌన్ : వేగంగా వెళ్తున్న ద్విచక్ర వాహనం ఎదురుగా వస్తున్న ఆటోను ఢీకొన్న ప్రమాదంలో బైక్ నడుపున్న వ్యక్తి దుర్మరణం చెందిన సంఘటన బుధవారం స్థానిక డిసిసిబి బ్యాంకు సమీపంలో చోటుచేసుకుంది. ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాలు ప్రకారం... యలమంచిలి నుంచి ముగ్గురు వ్యక్తులు బైకుపై వేగంగా వెళ్తూ బుధవారం సాయంత్రం 5.30 గంటల సమయంలో స్థానిక డిసిసిబి బ్యాంకు వద్దకు వచ్చేసరికి ఎదురుగా వస్తున్న ఆటోను బలంగా ఢీకొన్నారు. దీంతో ఆటో తిరబడిపోయింది. బైక్‌పైన వెళుతున్న ముగ్గురుకి తీవ్ర గాయాలు కాగా, ఆటోలో ఉన్న ఐదుగురు ప్రమాణికులు గాయపడ్డారు. క్షతగాత్రులను స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించగా మార్గ మధ్యలో బైకిస్టు మృతి చెందారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

ఎటిఎం కార్డులతో చోరీకి పాల్పడుతున్న వ్యక్తి అరెస్టు

ప్రజాశక్తి -గాజువాక : ఎటిఎం సెంటర్లలో కార్డులను మార్పిడి చేసి నగదును చోరీకి పాల్పడుతున్న వ్యక్తిని గాజువాక పోలీసులు బుధవారం అరెస్టుచేశారు. తెలంగాణకు చెందిన బానోతి రాజు (30) ఎటిఎం కేంద్రాల వద్ద సహాయం చేస్తున్నట్లు నటిస్తూ పిన్ నంబర్ తెలుసుకుని, కార్డు మార్చి నగదు డ్రా చేసి చోరీకి పాల్పడుతున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ విధంగా ఇతనిపై ఏపీ, తెలంగాణల్లో 12 కేసులు ఉన్నాయని వివరించారు. ఇతని నుంచి ఎటిఎం కార్డులు, రూ.50 వేలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

థింసా నృత్యం చేస్తున్న మహిళలు

ఉత్సాహంగా మన ఊరు - మన కలయిక

ప్రజాశక్తి -సీలేరు: మన ఊరు మన కలియక కార్యక్రమం జీకే వీధి మండలం సీలేరు ఎపి జెన్కో రెగ్యులేటరీడ్యాం వద్ద ఉన్న రాంబ్రహ్మ పార్కులో నక్క జ్ఞానేశ్వర్‌రావు, బొర్రా కృష్ణ, సత్తిబాబు శేఖర్‌రావు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్ర మానికి అధిక సంఖ్యలో ప్రజలు హాజరయ్యారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. త్రో బాల్, మ్యూజికల్ చైర్, టగ్‌ఆఫ్‌వార్ కార్యక్రమాలు నిర్వహించారు. మహిళలు క్రీడల్లో ఉత్సాహంగా పాల్గొని ప్రతిభను కనపరిచారు. విజేతలకు ఆకర్షణీయ మైన బహుమతులు అందజేశారు. దీనికోసం పార్కును పిచ్చి మొక్కలు తొలగించి సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. కార్యక్రమం లో ఏపీ జెన్కో ఉద్యోగులు, కార్మికులు, కాంట్రాక్ట్ కార్మికులు

సాంకేతిక లోపంతో నిలిచిన బస్సు

ప్రజాశక్తి -సీలేరు: జికె వీధి మండలం సప్పర్ల ఘాట్ రోడ్‌లో విశాఖపట్నం భద్రాచలం బస్‌సర్వీస్ సాంకేతిక లోపాలతో నిలిచిపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులకు గురయ్యారు. బుధవారం తెల్లవారుజామున 5.30 గంటలకు విశాఖపట్నం కాంప్లెక్స్‌లో బయలుదేరి నర్సీపట్నం చింతపల్లి జికేవీధి మీదగా సప్పర్ల ఘాట్‌రోడ్డుకు వస్తుండగా ఇంజన్ నుంచి పొగలు కమ్ముకున్నాయి. గమనించిన డ్రైవర్ అప్రమత్తమై బస్సు నిలుపుదల చేశారు. ఇంజిన్‌ని పరిశీలించి సాంకేతిక లోపాలు తలెత్తినట్లు గుర్తించారు. అనంతరం డిపో మేనేజర్‌కు, సిబ్బందికి సమాచారం అందించారు. ప్రయాణికులు నర్సీపట్నం వయా సీలేరు వెళ్లే బస్సులో ప్రయాణికులను ఎక్కించి తరలించాలని విశాఖ డిపో మేనేజర్ సిబ్బందికి ఆదేశించారు. నర్సీపట్నం డిపో నుంచి బుధవారం ఉదయం 10 గంటలకు బయలుదేరి చింతపల్లి జీకే వీధి సప్పర్ల మీదగా సీలేరు వచ్చే బస్సులో అధిక శాతం మంది ప్రయాణికులు ఉండడంతో కొంతమంది ప్రయాణికుల్ని ఎక్కించారు. అనంతరం పాడేరు డిపోకు చెందిన పాడేరు వయా చింతపల్లి జికే వీధి సీలేరు మీదుగా డొంకరాయి వెళ్లే బస్‌లో మరికొంతమందిని ప్రయాణికులను ఎక్కించారు. కొంతమంది ద్విచక్ర వాహనాలపై దారకొండ, గాలికొండ తదితర గ్రామాలకు ప్రయాణికులు సురక్షితంగా వెళ్ళిపోయారు. నర్సీపట్నం నుంచి ఆర్టీసీ బస్సు మెకానిక్ వచ్చి విశాఖ- భద్రాచలం బస్సు సర్వీస్ లోపాలను సవరిస్తారని విశాఖ ఆర్టీసీ మేనేజర్ మాధురి తెలిపారు. ఆర్‌వినగర్ నుంచి పాలగెడ్డ వరకు రహదారి అస్తవ్యస్తంగా ఉండడంతో ప్రయాణికులకి కష్టాలు తప్పడం లేదు. రహదారి సౌకర్యం సక్రంగా లేకపోవడంతో బస్సులు తరచూ మరమ్మతులు గురవుతున్నాయి. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్, ఆర్ అండ్ బి అధికారులు ఆర్‌వినగర్ నుంచి పాలగెడ్డ వరకు మరమత్తు పనులు తక్షణమే నిర్వహించేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

నారపాడు పంచాయతీ విభజనపై గ్రామసభ

ప్రజాశక్తి-సబ్బవరం : మండలంలోని నారపాడు పంచాయతీ విభజన కోసం బుధవారం గ్రామసభ ఏర్పాటు చేయగా, ఇరు గ్రూపుల మధ్య ఘర్షణ వాతావరణం చోటుచేసుకోవడంతో గ్రామసభను వాయిదా వేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల పంచాయతీల విభజన కోసం గ్రామ సభలు పెట్టి పంచాయతీలను విభజించుకోవచ్చునని జీవో ఇవ్వడంతో నారపాడు పంచాయతీ విభజన కోసం బుధవారం సర్పంచ్ మామిడి శంకర్రావు ఆధ్వర్యాన గ్రామసభ ఏర్పాటు చేశారు. పంచాయతీలో పదిమంది వార్డు సభ్యులు ఉండగా ఎనిమిది మంది గ్రామసభకు హాజరయ్యారు. వార్డు సభ్యుల కోరం సరిపోవడంతో సభ నిర్వహించారు. గ్రామసభకు హాజరైన 8 మందిలో ఐదుగురు వార్డు సభ్యులు పంచాయతీ విభజనకు మద్దతుగా చేతులెత్తగా, ముగ్గురు వార్డు సభ్యులు వ్యతిరేకించారు.

విశాఖ రైల్వేస్టేషన్‌కు అంతర్జాతీయ హంగులు

ఎంపీ మతుకుమిల్లి శ్రీ భరత్

ప్రజాశక్తి-ఎంవిపికాలనీ: విశాఖ రైల్వేస్టేషన్ భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా, అద్భుతమైన మౌలిక సదుపాయాలతో సరికొత్త రూపు సంతరించుకోబోతోంది. బుధవారం విశాఖ రైల్వేస్టేషన్‌లో అధికారులతో కలిసి పర్యటించిన ఎంపీ మతుకుమిల్లి శ్రీభరత్, ఈ పునర్నిర్మాణ ప్రాజెక్టుపై సమీక్ష నిర్వహించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రస్తుతం ఉన్న 8 ప్లాట్‌ఫామ్‌ల సంఖ్యను 14కి పెంచబోతున్నామని, దీనికి అనుగుణంగా 16 రైల్వే లైన్లు వచ్చేలా ప్రణాళికలు సిద్ధమయ్యాయని ఎంపీ తెలిపారు. ప్రాజెక్టులో భాగంగా మొదట జ్ఞానపురం (పశ్చిమ) వైపు ఉన్న పాత భవనాన్ని తొలగించి, అక్కడ అత్యాధునిక వసతులతో కూడిన అతిపెద్ద భవనాన్ని నిర్మిస్తారు. తర్వాతే తూర్పు వైపు ఉన్న ప్రధానస్టేషన్ భవన నిర్మాణ పనులు చేపడతారని ఆయన స్పష్టం చేశారు. రాబోయే రోజుల్లో రద్దీకి అనుగుణంగా విస్తరించేందుకు వీలుగా, భవన పునాదులను 11 అంతస్తుల వరకు తట్టుకునేలా నిర్మించాలని రైల్వే మంత్రి సూచించారని, అందుకు తగినట్లుగా స్ట్రక్చరల్ రీ-డిజైనింగ్ జరుగుతోందని ఎంపీ వివరించారు. ఈ పునర్నిర్మాణ పనుల్లో భాగంగా తూర్పు పశ్చిమ స్టేషన్లను కలుపుతూ విశాలమైన ఏరో బ్రిడ్జి నిర్మిస్తారు. ఇప్పుడున్న 3 మీటర్ల వెడల్పు గల ఫుట్‌ఓవర్ బ్రిడ్జిల స్థానంలో 12 మీటర్ల వెడల్పు గల బ్రిడ్జిలు రానున్నాయి. సుమారు 350 కార్లు, 1500 బైక్‌లను నిలిపేలా అత్యాధునిక పార్కింగ్ వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నారు. సుమారు 500 కోట్ల వ్యయంతో చేపడుతున్న ఈ ప్రాజెక్టు కోసం పాత నిర్మాణాల తొలగింపునకు ఇప్పటికే 20 కోట్లు వ్యయం చేశామన్నారు. బిల్డింగ్‌ప్లాన్ తుది ఆమోదం లభించిన వెంటనే 18 నుంచి 21 నెలల కాలంలోనే పనులు పూర్తి చేస్తామని వెండార్ సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. ఎయిర్‌పోర్ట్ తరహాలోనే ప్రయాణికుల రాకపోకలకు ప్రత్యేక మార్గాలు ఉంటాయని, రద్దీ సమయాల్లోనూ ప్రయాణీకులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. కార్యక్రమంలో విశాఖ దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్, విశాఖపట్నం డివిజన్ రైల్వేయూజర్స్ కన్సల్టేటివ్ కమిటీ సభ్యులు చలసానిగాంధీ, సిఎఒ అంకుష్ గుప్తా, చీఫ్ ఇంజనీర్లు రైల్వేస్టేషన్ డైరెక్టర్లు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనే ప్రభుత్వ లక్ష్యం

సామాజిక భవనం శంకుస్థాపనలో మేయర్ పీలా శ్రీనివాసరావు

ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ: నగర ప్రజలకు మౌలిక వసతులు కల్పనే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని నగర మేయర్ పీలా శ్రీనివాసరావు పేర్కొన్నారు. బుధవారం మూడో జోన్ 18వ వార్డు పరిధిలోని ఎంవిపి కాలనీ సెక్టర్-9 లో సుమారు 66.50 లక్షల జివిఎంసి నిధులతో నిర్మించిన సామాజిక భవనం మొదట అంతస్తు నిర్మాణానికి విశాఖ ఎంపి ఎం.శ్రీభరత్, తూర్పు నియోజకవర్గం శాసనసభ్యులు వెలగపూడి రామకృష్ణబాబు, కార్పొరేటర్ గొలగాని మంగవేణితో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మేయర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రజలకు మౌలిక వసతులు కల్పనే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పని చేస్తోందని ముఖ్యమంత్రి చంద్రబాబు విశాఖ అభివృద్ధి పై ప్రత్యేకదృష్టి సారించారని, అందుకు అనుగుణంగా నగరాభివృద్ధి జరుగుతోం దన్నారు. 18 వ వార్డు ప్రజల అవసరం మేరకు సామాజిక భవనం మొదటి అంతస్థు నిర్మాణానికి నేడు శంకుస్థాపన చేసామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జోనల్ కమిషనర్ శివప్రసాద్, జివిఎంసి కార్యనిర్వాహక ఇంజనీర్, ఉప కార్యనిర్వాహక ఇంజనీరు, సహాయక ఇంజనీరు, సచివాలయం కార్యదర్శులు , తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షులు పట్టాభిరామ్, వార్డు అధ్యక్షులు గొలగాని పోలారావు, పలువురు వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

41 మందితో టిడిపి విశాఖ పార్లమెంట్ కమిటీ

ప్రజాశక్తి-విశాఖ కలెక్టరేట్: టిడిపి విశాఖపట్నం పార్లమెంట్ కమిటీ జాబితాను పార్టీ అధిష్టాన వర్గం ప్రకటించింది. 41 మందితో కమిటీని ఏర్పాటు చేశారు. కమిటీ అధ్యక్షునిగా చోడే వెంకట పట్టాభి (విశాఖ తూర్పు), ప్రధాన కార్యదర్శిగా లొడగల కృష్ణ (విశాఖఉత్తర) ఇప్పటికే ప్రకటించిన సంగతి తెలిసిందే. వీరు కాకుండా ఉపాధ్యక్షులు 9 మంది, ఆర్గనైజింగ్ కార్యదర్శులు 9 మంది, స్పోక్స్‌మెన్స్ 9 మంది, కార్యదర్శులు 9 మంది, వీరు కాకుండా పార్లమెంట్ ఆఫీస్ కార్యదర్శి, కో ఆర్డినేటర్, మీడియా కోఆర్డినేటర్ ఒక్కొక్కరిని నియమించారు. దక్షిణ నియోజవర్గం నుంచి ఉపాధ్యక్షునిగా అబ్దుల్ హనీఫ్, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా గనగళ్ళ సత్యవతి, స్పోర్ట్స్ మెన్‌గా విల్లూరి భాస్కరరావు (కార్పొరేటర్), కార్యదర్శిగా తాడి వేణుకుమారి నియమితులు అయ్యారు. పార్లమెంట్ ఆఫీస్ కార్యదర్శిగా బండారి అప్పారావు (ఉత్తర) కో ఆర్డినేటర్‌గా బైరెడ్డి పోతన్నరెడ్డి (తూర్పు), మీడి యా కో ఆర్డినేటర్‌గా కొత్తపల్లి ఉషారాణి (గాజువాక) నియమితులయ్యారు.

బాదంతో ఎంతో మేలు

ప్రజాశక్తి- విశాఖకలెక్టరేట్: అధిక పోషకాలు కలిగిన కాలిఫోర్నియా ఆల్మండ్స్‌తో ఆరోగ్యానికి ఎంతో మేలు జరుగుతుందని క్రిస్మస్ సందర్భంగా విశాఖ నగరంలో జరిగిన ఒక కార్యక్రమంలో పాల్గొన్న పోషకాహార, వెల్నెస్ కన్సల్టెంట్ షీలా కృష్ణస్వామి అన్నారు. సహజ సిద్ధమైన 15 ముఖ్యమైన పోషకాలు సమృద్ధిగా ఉన్న బాదం, గుండె ఆరోగ్యాన్ని ప్రోత్సహిస్తూ, శాశ్వత శక్తిని అందిస్తాయని, ఆకలిని నియంత్రణలో ఉంచేందుకు సహాయపడతాయన్నారు.



నృత్యాలు చేస్తున్న కళాకారులు

ఆకట్టుకున్న శ్రామిక ఉత్సవ్ సాంస్కృతిక ప్రదర్శనలు

ప్రజాశక్తి-అనకాపల్లి: సిఐటియు అఖిల భారత మహాసభలు విశాఖపట్నంలో డిసెంబర్ 31 నుంచి జనవరి 4 వరకు నిర్వహిస్తున్న నేపథ్యంలో అనకాపల్లిలో బుధవారం అనకాపల్లి శ్రామికఉత్సవ్ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించింది. నెహ్రూచౌక్ జంక్షన్ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రధాన బ్రాంచ్ ఎదురుగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో అనకాపల్లి నేతాజీహాస్టల్, సిటీ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు, జీవీఎంసీ వర్కర్స్ విద్యార్థులు ప్రదర్శించిన దేశభక్తి నృత్యాలు ఎంతో ఆకట్టుకున్నాయి. ఐద్వా కోలాట బృందం గురువు సిహెచ్ మంగతాయారు నేతృత్వంలో మాణిక్యం, డిడి వరలక్ష్మి, వాణిశ్రీ, అద్భుత నృత్యాలతో అలరించారు. ఎన్టిపిసి ఉద్యోగినాయక్ ప్రదర్శించిన మ్యాజిక్‌షో ఆకట్టుకుంది. సొంట్యాన మురళి, మార్టూరు అజయ్, పెంటకోట లీలారాణి, దార్ల శ్రీనివాసరావు ఆలపించిన సినీ, దేశభక్తి గేయాలు కూడా అలరించాయి. పట్టణ సీఐ ప్రేమ్‌కుమార్, రూరల్ సీఐ అశోక్‌కుమార్, ట్రాఫిక్ సిఐ వెంకటనారాయణ, ఏపీ రైతు సంఘం జిల్లా కోశాధికారి గండి నాయనబాబు, సిఐటియు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు వివి సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు గంట శ్రీరామ్ చేతుల మీదుగా జ్ఞాపికలు, ప్రశంస పత్రాలు అందజేశారు.

సైకిల్‌పై యువకుని సాహసయాత్ర

ప్రజాశక్తి -రాజవొమ్మంగి: సైకిల్‌పై నేపాల్‌కు యువకుడు సాహసోపేత యాత్ర చేపట్టాడు. యువత వ్యసనా లకు దూరంగా ఉండాలనే సందేశంతో ఖమ్మం జిల్లాకు చెందిన ఫాజిల్ నేపాల్‌కు సైకిల్‌యాత్ర చేపట్టారు. రంపచోడవరం మీదుగా మంగళవారం రాజవొమ్మంగి చేరుకున్న ఆయన విలేకరులతో మాట్లాడారు. రోజుకు 100 కి.మీ.ప్రయాణిస్తూ వివిధ ప్రాంతాల సంస్కతిని సాంప్రయా దాయాలు అధ్యయనం చేస్తున్నా నని యువకుడు తెలిపారు.

ఫాజిల్

డ్రగ్స్‌పై అవగాహన కల్పిస్తున్నానని తెలిపారు. సమాజ మార్పు కోసం ఈ యువకుడు చేస్తున్న సాహసోపేత యాత్రను పలువురు అభినందిస్తున్నారు.

'విప్లవాత్మక సంస్కరణలకు బీజం వేసింది పెరియార్'

ప్రజాశక్తి-విశాఖకలెక్టరేట్ : దేశంలో మొట్టమొదట విప్లవాత్మక సంస్కరణలకు బీజం వేసిన వ్యక్తి పెరియార్ ఇ.విరామస్వామి అని భారత నాస్తిక సమాజం జిల్లా అధ్యక్షులు వై.నూకరాజు అన్నారు. బుధవారం పెరియార్ ఇ.వి రామస్వామి వర్ధంతి సందర్భంగా భారత నాస్తిక సమాజం,పెరియార్ ఆశయ సాధన సంఘం ఆధ్వర్యంలో ఆర్‌కెబీచ్, పెరియార్ విగ్రహం వద్ద వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నూకరాజు మాట్లాడుతూ కులాధిపత్యం అణచివేత, చాందసభావాలపై రణభేరి మోగించిన విప్లవ నాయకుడు పెరియార్ అన్నారు. ముఖ్యంగా ఆయన తమిళనాడులో 1925లో స్వాభిమాన ఉద్యమం ప్రారంభించారని, ఈ ఏడాదితో ఆ ఉద్యమానికి వందేళ్లు పూర్తవుతాయన్నారు.కార్యక్రమంలో భారత నాస్తిక సమాజం ప్రతినిధులు రాంప్రభు, డి.విజ్ఞానంద్, జె.శ్యామల, మధుబాబు, సాధన సంఘం సభ్యులు పాల్గొన్నారు.

న్యూ ఇయర్ వేడుకలకు థీమ్ పార్క్ సిద్ధం

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్: షిర్డీలోని సాయితీర్థ్ తన తొలి న్యూ ఇయర్ వేడుకగా 'మిడ్‌నైట్ మ్యాజిక్, గ్రాండ్ న్యూ ఇయర్ సెలబ్రేషన్' నిర్వహించేందుకు సిద్ధమవుతోందని ఇమాజిక వరల్డ్ మేనేజింగ్ డైరెక్టర్ జై.మల్పాణి తెలిపారు. విశాఖపట్నంలో ఆయన మాట్లాడుతూ, సంప్రదాయ బద్ధంగా సాగే 'మిడ్‌నైట్ మ్యాజిక్' ద్వారా, సాయితీర్థ్ సందర్శకులకు ఆధ్యాత్మికత, సంస్కృతి వేడుకల సమ్మేళనంతో కూడి, కుటుంబమంతా కలిసి ఆనందించగల అర్థవంతమైన అనుభూతిని అందించడమే లక్ష్యంగా జరుగుతుందన్నారు. టిక్కెట్లు అందుబాటులో ఉన్నాయని, వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో బుక్ చేసుకోవచ్చన్నారు.

ముగిసిన 'బ్లెండర్స్ ప్రైడ్ ఫ్యాషన్ టూర్'

ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ: ఈ ఏడాది 'బ్లెండర్స్ ప్రైడ్ ఫ్యాషన్ టూర్' తన ముగింపు వేడుకను ఫ్యాషన్ ప్రపంచంలో ఒక అద్భుత ప్రయోగంగా ముగించిందని సంస్థ సిఎంఒ దేబాశ్రీదాస్ గుప్తా అన్నారు. బుధవరం విశాఖలో ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రముఖ డిజైనర్ అనామికఖన్నా తన ఏకే ఎఒకే' కలెక్షన్‌తో సంప్రదాయ జర్దోజీ, ఆధునిక టైలరింగ్ గ్రాఫిక్స్ హంగులను జోడించి సరికొత్తగా ప్రదర్శించామని ఈ ప్రదర్శనలో యువ నటుడు ఇషాన్ ఖట్టర్ షో-స్టాపర్‌గా నిలిచి అందరి దృష్టిని ఆకర్షించారు. కాంతి, పొగ, లేజర్ లైట్లతో కూడిన సాంకేతికత ఈ ఫ్యాషన్ షోను తేలియాడే థియేటర్‌గా మార్చేసింది. ఈ వేడుక భారతీయ సంప్రదాయం ఆధునికత కలయికతో ఒక కొత్త శకానికి నాంది పలికిందని ఆయన తెలిపారు.